క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా కల్లూరి

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కల్లూరి వెంకటేశ్వరరెడ్డిని పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కల్లూరికి అభిమానులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కల్లూరి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పదవీ బాధ్యతలను అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాబోవు రోజుల్లో ఉదయగిరిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



సీతారామపురం: స్థానిక ఆర్టీసీ బస్‌షెల్టర్ ప్రాంగణంలో జాలీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడానైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20,116, ద్వితీయ బహుమతిగా రూ.10,116, తృతీయ బహుమతిగా రూ.5,116 నగదుతో పాటు షీల్డులు అందజేయనున్నట్లు వివరించారు. కాగా తొలిరోజు మారంరెడ్డిపల్లి, సీతారామపురం జట్లు పోటీ పడ్డాయి.

బీజేపీ మండలాధ్యక్షుడిగా జయకుమార్



కావలి: బీజేపీ మండలాధ్యక్షుడిగా జరుగుమల్లి జయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బూత్‌కమిటీ అధ్యక్షుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రకోట గ్రామానికి చెందిన జరుగుమల్లి జయకుమార్‌ను పార్టీ మండలాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలో బీజేపీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల పరిశీలకులు సీవీసీ సత్యం, మండల మాజీ అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాసులు, రంగారెడ్డి, క్రాంతి కుమార్, కామాక్షి, సురేంద్ర, జయరాంరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు సహకరించాలి



కలిగిరి: కలిగిరి పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ రాగి దివ్య, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి కోరారు. కలిగిరిలో ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా గ్రామస్తులకు డస్ట్‌బిన్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి పారిశుధ్య కార్మికులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు అందజేయాలని కోరారు.

ప్రమాదభరితంగా గుంత



కావలి: పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వద్ద గుంత ప్రమాదభరితంగా ఉంది. ట్రంకురోడ్డులోని నాలుగురోడ్ల కూడలి వద్ద తరచూ షామియానాలు వేసి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. షామియానా వేసేందుకు రోడ్డుపై గుంతను తవ్వివదిలేశారు. గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నా రు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడలిలోని రోడ్డుపై ఉన్న గుంతను ఆర్‌అండ్‌బీ లేదా మున్సిపల్ అధికారులు పట్టించుకుని పూడ్చేసి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీనగర్ కాలనీలో చోరీ

ఉదయగిరి: పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలోని ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు.. శ్రీనగర్‌కాలనీకి చెందిన మెహరాజ్ శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి సినిమాహాల్ ప్రాంతంలో నివాసం ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లింది. ఆదివారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా 3 గ్రాముల బంగారం, రూ.15వేలు నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై ఇంద్రసేనారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు

- వేలల్లో అర్జీలు
- పది శాతం అర్జీలకు కూడా పరిష్కారం చూపని అధికారులు
- కనీసం అర్జీలకు రశీదులు ఇవ్వని వైనం
- పెదవి విరుస్తున్న అర్జీదారులు

➡ కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన బండ్లమూడి కొండమ్మకు గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో రెండున్నర ఎకరాల భూమిని మంజూరు చేశారు. భూమికి హద్దులు చూపి పట్టా ఇవ్వడంతో సాగు చేసుకుంటోంది. అయితే రెండేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమి తనదని, తనకు పట్టా ఇచ్చారని అడ్డం తిరగడంతో బాధితురాలు పలుమార్లు మండల రెవెన్యూ అధికారులను కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. వారు పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌ను సైతం కలిసింది. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నట్లు కూటమి ప్రభుత్వం చెప్పడంతో ఎంతో ఆశతో గత నెల 26న గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అధికారులకు అర్జీ అందజేసింది. 29వ తేదీ తహసీల్దార్ కార్యాలయానికి రమ్మని చెప్పిన అధికారులు అక్కడకు వెళ్తే పట్టించుకోలేదని కొండమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.

➡ దుత్తలూరు మండలం అయ్యన్నపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 176/1–3లో నల్లబోతుల రమణమ్మ పేరుపై 0.79 సెంట్లు, లక్ష్మమ్మ పేరుపై 0.40 సెంట్లు కలిపి 1.19 ఎకరాల భూమి వారసత్వంగా ఉంది. అయితే గతేడాది అక్టోబరులో లక్ష్మమ్మకు చెందిన 0.40 సెంట్లను ఎటువంటి పత్రాలు లేకుండానే రమణమ్మ పేరుపై మ్యుటేషన్ చేయడంతో లక్ష్మమ్మకు చెందిన వారసులు కలెక్టర్, తహసీల్దార్‌ను కలిసి అర్జీలు అందజేశారు. రెవెన్యూ సదస్సులో సమస్యను వెంటనే పరిష్కరిస్తారనే ఆశతో అధికారులకు విన్నవించారు. అయినా అధికారులు ఎలాంటి పరిష్కారం చూపలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

భూసమస్యలు పరిష్కారానికి నోచుకునేనా?



దుత్తలూరులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

రెవెన్యూ సదస్సుల సమాచారం

మండలం	రెవెన్యూ గ్రామాలు	వచ్చిన అర్జీలు	పరిష్కరించినవి
కలిగిరి	20	535	92
సీతారామపురం	21	399	12
ఉదయగిరి	17	302	08
జలదంకి	12	370	59
దుత్తలూరు	17	138	30
వింజమూరు	19	793	02
కొండాపురం	26	155	25
వరికుంటపాడు	28	189	0

దుత్తలూరు/కొండాపురం: రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం వాటిని చివరకు మొక్కుబడి తంతుగా మార్చేంది. భూసమస్యలపై వేలల్లో ఫిర్యాదులు అందినా..పరిష్కారం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో బాధితులు ఉసూరుమంటూ మళ్లీ తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలకు పోటెత్తుతున్నారు.

2,881కుపైగా అర్జీలు

ఉదయగిరి నియోజకవర్గంలో భూసమస్యలు అధికంగా ఉన్నాయి. నియోజకవర్గంలో గత డిసెంబరు 6 నుంచి శనివారం వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 2,881 అర్జీలు అందాయి. మ్యుటేషన్, సర్వే, కొలతల్లో వ్యత్యాసం, అడంగల్‌లో మార్పులు, నూతన పాస్‌బుక్‌లు, పేర్లు మార్పిడి, ఆక్రమణలు, వారసత్వం, తదితర భూసమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. అయితే కేవలం 228 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరో 2,653 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం విశేషం. అంటే దరఖాస్తుల పరిష్కారం పది శాతానికి కూడా మించలేదని ఇట్టే తెలుస్తోంది.

తూతూమంత్రంగా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన భూసంస్కరణలను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం వాటిపై విషం చిమ్మేందుకు రెవెన్యూ సదస్సులను చేపట్టిందనే విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలను వెంటనే పరిష్కరించనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు పెద్ద ఎత్తున అర్జీలను అందజేశారు. దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలపైనే అర్జీలు ఎక్కువగా వచ్చాయి. రెవెన్యూ సదస్సుల్లోనే కొన్ని సమస్యలను పరిష్కరించే అవకాశం ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని బాధితులు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పనిలేకుండా రెవెన్యూ సదస్సుల ద్వారా తమ భూసమస్యలు తీరుతాయని రైతులు ఆశించారు. వాటిపై దరఖాస్తులు అందజేసినా సమస్యల పరిష్కారానికి అధికారులు పెద్దగా శ్రద్ధ చూపకపోవడంతో రెవెన్యూ సదస్సులు తూతూమంత్రంగా కొనసాగాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్జీల పరిష్కారానికి 45 రోజుల గడువు విధించడంతో మళ్లీ తహసీల్దార్ కార్యాలయాలు, వీఆర్వోలు, సర్వేయర్ల చుట్టూ రోజుల తరబడి తిరిగే బాధ తప్పేలా లేదని వాపోతున్నారు.

అర్జీలకు రశీదులు లేవు

రెవెన్యూ సదస్సులకు వచ్చిన అర్జీలు, పరిష్కరించిన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ప్రజలు అందజేసే ప్రతి అర్జీకి రశీదు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. కానీ అధికారులు ఎటువంటి రశీదులు ఇవ్వకుండా అర్జీలను తీసుకుని వెళ్తున్నారు. దీంతో తమ అర్జీల పరిస్థితి ఏమిటని దరఖాస్తుదారులు మదనపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన భూసమస్యలకు పరిష్కారం చూపాలని బాధితులు కోరుతున్నారు.

ఏళ్ల నాటి వేపచెట్ల కూల్చివేత



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బంగ్లా సెంటర్‌లో ఉన్న ఏళ్ల నాటి భారీ వేపచెట్లను జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేసే ప్రక్రియను కాంట్రాక్టర్ ఆదివారం చేపట్టారు. బంగ్లాసెంటర్‌లో సుమారు వందేళ్ల నుంచి వేపచెట్లు ఉన్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. కావలి–ఉదయగిరి మార్గంలో ప్రయాణించే ప్రయాణికుల సేదతీర్చే భారీ వేపచెట్లను కూల్చివేయడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. సీనియర్ సిటిజన్లు వేపచెట్లతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు తెచ్చుకుని బాధ పడుతున్నారు. అభివృద్ధి పేరుతో వందల ఏళ్ల నాటి చెట్లను కూల్చేకుండా ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



కావలి: పట్టణంలోని పెద్ద చెరువు వద్ద కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఐక్యత, స్నేహభావం పెంపొందడానికి సంక్రాంతి సంబరాలు దోహదపడుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు.

అన్నవరంలో వైద్యశిబిరం

జలదంకి: మండలంలోని అన్నవరంలో గట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జే పద్మజ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. 133 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి పద్మజ మాట్లాడుతూ గ్రామంలో విషజ్వరాలతో 8 నుంచి 10 మంది గ్రామస్తులు మరణించినట్లుగా కొన్ని పత్రికల్లో శనివారం కథనాలు రావడంతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు లేవని వివరించారు. సాధారణ జ్వరాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గ్రామంలో ఇంతవరకు జ్వరాలతో ఎవరూ మరణించలేదని, వివిధ అనారోగ్య కారణాలతో మరణించిన వారు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి నివేదికను డీఎంహెచ్‌ఓకు పంపినట్లు తెలిపారు. జిల్లా మలేరియా సహాయ అధికారి వీ నాగార్జునరావు, కావలి సబ్‌యూనిట్ అధికారి టీ లక్ష్మీనరసయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న గట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

మర్యాదపూర్వకంగా...



ఉదయగిరి: కాకాణి, విక్రమ్‌రెడ్డిని సత్కరిస్తున్న వింజమూరు నేతలు



సంగం: విక్రమ్‌రెడ్డిని సత్కరిస్తున్న కరిముల్లా



ఆత్మకూరు: విక్రమ్‌రెడ్డిని కలిసిన డాక్టర్ జే ప్రణీత్



ఆత్మకూరు: విక్రమ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ ఆదిశేషయ్య



ఆత్మకూరు: కాకాణిని సత్కరిస్తున్న ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు/సంగం/ఉదయగిరి: నెల్లూరులో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ ఆదిశేషయ్య ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాకాణి, మేకపాటిని శాలువాలతో సత్కరించి తనను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, చిల్లూరు వెంకటేశ్వర్లు, బాలఅంకయ్య, తదితరులు ఉన్నారు. అలాగే మేకపాటి విక్రమ్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఆత్మకూరుకు చెందిన డాక్టర్ జే ప్రణీత్ ఆదివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించిన మేకపాటికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, బాలఅంకయ్య, తదితరులు ఉన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సంగం మండలం తలుపూరుపాడుకు చెందిన షేక్ కరిముల్లా సైతం మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, దగుమాటి మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన వింజమూరుకు చెందిన పల్లాల కొండారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట వింజమూరు మండల నాయకులు రేవునూరి శ్రీనివాసరెడ్డి, ఆనంగి రమణయ్య, మద్దూరి చిన్నికృష్ణారెడ్డి, గోపిరెడ్డి రమణారెడ్డి, మద్దూరి చంద్రశేఖర్, కాటం రమణారెడ్డి, కొంకల వెంకటేశ్వర్లు, బియ్యపురెడ్డి విజయరెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కావలి: పట్టణంలోని ఉదయగిరి రోడ్డులోని క్రీడా శాఖ మైదానంలో కావలి నియోజకవర్గ, జలదంకి మండలం స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. సిద్ధు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. అనంతరం కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

10న వైకుంఠ ఏకాదశి వేడుకలు

కావలి: ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణంలోని బృందావనం కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేకువన 4 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు బృందావనం హౌసింగ్ కాలనీ అధ్యక్షుడు శ్రీరాం మాల్యాద్రి ఆదివారం తెలిపారు. ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 11న ఉదయం 7.30 గంటలకు చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు శ్రీవారిని దర్శించుకుని కృపకుపాత్రులు కావాలని కోరారు.

రేషన్ డీలర్ల నియామకాలకు బ్రేక్

కావలి: కావలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 86 రేషన్ దుకాణాలకు డీలర్ల నియామానికి సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను నిలిపేస్తున్నట్లు కావలి ఆర్డీఓ ఎం వంశీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా కార్యణాల దృష్ట్యా కొన్ని సవరణలు చేయాల్సి ఉందని, సవరణ ప్రకటన విడుదల చేసే వరకు ప్రస్తుతం ప్రకటించిన నోటిఫికేషన్‌ను నిలిపివేస్తున్నట్లుగా వివరించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఇర్మియా



కూనిపోగు ఇర్మియా

కలిగిరి: కలిగిరికి చెందిన కూనిపోగు ఇర్మియా వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఆయన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన కార్యకర్తగా గుర్తింపు పొందారు. పార్టీ తరుపున ఏ కార్యక్రమం చేపట్టినా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గానూ కీలకంగా వ్యవహరించారు. సామాన్య కార్యకర్తగా ఉన్న ఆయనను జిల్లా అధికార ప్రతినిధిగా నియమించి సముచిత స్థానం కల్పించడంపై నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇర్మియా మాట్లాడుతూ సాధారణ కార్యకర్తగా ఉన్న తనకు జిల్లా పదవి ఇవ్వడమే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి దళితులకు అధిక ప్రాధాన్యత ఇస్తారడానికి నిదర్శనమన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువనేత అభినవ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అల్లూరు: కార్తీక్ మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని నార్తుమోపూరులో శుక్రవారం రెండువర్గాల మధ్యన జరిగిన ఘర్షణలో కార్తీక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్తీక్ కుటుంబ సభ్యులను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం ఘటనపై గ్రామంలో విచారణ జరిపారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ, రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా మహిళా ఇన్‌చార్జి గేరా జానకిమాల, కావలి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కత్తి శివయ్య మాదిగ, కావలి పట్టణ అధ్యక్షుడు చేవూరు వరప్రసాద్‌మాదిగ, కావలి పట్టణ సీనియర్ నాయకులు చేవూరు కిరణ్‌మాదిగ అల్లూరు మండలం నాయకులు దర్శిగుంట కోటయ్య మాదిగ, దర్శిగుంట వాసుమాదిగ, మల్లికార్జున మాదిగ, దర్శగుంట సాంబయ్య మాదిగ మంచు ప్రసాద్ మాదిగ, జంపాల శీనయ్య మాదిగ పాల్గొన్నారు.



గ్రామంలో విచారణ జరుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీపీఎం విరాళాల సేకరణ

సోమశిల: అనంతసాగరం మండలంలోని లింగంగుంటలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మంగళ పుల్లయ్య మాట్లాడుతూ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, ఉద్యోగులు, పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం సాగిస్తుందన్నారు. నెల్లూరులో ఫిబ్రవరి 1,2, 3 తేదీలో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చివరి రోజు భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని వివరించారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబి, బీవీ రాఘవులు పాల్గొంటారని తెలిపారు. సీపీఎం మహాసభల జయప్రదానికి విరాళాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఆర్థికంగా, హార్దికంగా తోడ్పాటునందించి మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి అన్వర్‌బాషా, లింగంగుంట శాఖ కార్యదర్శి కానగాల శ్రీనివాసులు, సింగర నరసింహులు, మంగళ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



విరాళాలను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

హైందవ శంఖారావానికి భారీగా..



కావలి నుంచి తరలివెళ్తున్న వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు



వింజమూరు నుంచి...



ఆత్మకూరు నుంచి...

కావలి/ఆత్మకూరు/సంగం/ఆత్మకూరురూరల్/మర్రిపాడు/ వింజమూరు: ఎన్టీఆర్ జిల్లా కేసరపల్లిలో హైందవ శంఖారావం నినాదంతో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు హైందవ సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కావలి నుంచి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి, బట్టేపాడు, సంగం మండలం, మర్రిపాడు మండలం డీసీపల్లి, తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. వింజమూరు నుంచి వీహెచ్‌పీ మండల కన్వీనర్ కందుల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు పొందండి

- భూములు కౌలుకు ఇస్తే నష్టపోతారు
- ఏకసభ్య కమిషన్ చైర్మన్ రంజన్ మిశ్రా

అనుమసముద్రంపేట: ప్రభుత్వం మంజూరు చేసిన భూముల్లో ఉద్యాన పంటలను సాగు చేసుకుని లాభాలను పొందాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ రాజీవ్‌రంజన్‌మిశ్రా దళితులకు సూచించారు. మండలంలోని అనుమసముద్రంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఇందిర జలప్రభ పథకం కింద అభివృద్ధి చేసిన 240 ఎకరాల మామిడి తోటల బ్లాక్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూములు లీజుకు ఇస్తే నష్టపోతారని సొంతంగా మొక్కలు పెంచుకుంటే తద్వారా వచ్చే ఆదాయాన్ని అనుభవించవచ్చునని తెలిపారు. దళితులు పండించిన పంటలను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేలా ప్రయత్నిస్తామన్నారు. భూములకు నీటి సౌకర్యం కోసం మోటార్లు, పొలాలకు కంచెను డ్వామా సమకూరుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కొందరు దళిత రైతులు తమకు డీకేటీ పట్టాలు ఇవ్వలేదని ఆయనకు విన్నవించారు. స్పందించిన ఆయన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రతిఒక్కరికీ డీకేటీ పట్టాలు వచ్చేలా ప్రయత్నం చేస్తామన్నారు. తొలుత రంజన్ మిశ్రాకు ఆత్మకూరు ఆర్డీఓ పావని పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఆయన వెంట ఆర్డీఓ పావని, ఎంపీ పీడీ శ్రీనివాసులు, ఏపీడీ శంకరనారాయణ, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, సునీల్, సతీష్, డీటీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న రాజీవ్‌రంజన్ మిశ్రా